
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
సిద్దిపేట 5
బుధవారం 30 అక్టోబరు 2024





సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్, కలెక్టర్ మనుచౌదరి

న్యూస్ బాక్స్

బాధ్యతలు స్వీకరించిన అదనపు కలెక్టర్



కలెక్టర్‌ను కలిసిన అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్

సిద్దిపేట కలెక్టరేట్, అక్టోబరు29 (ఆంధ్ర జ్యోతి): సిద్దిపేట జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ)గా అబ్దుల్ హమీద్ మంగళ వారం కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో బాధ్యతలు స్వీకరించారు. అనంతరం కలె క్టర్ మనుచౌదరిని మర్యాదపూర్వకంగా కలిసి మొక్కను అందజేశారు. స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ హోదాలో హైదరా బాద్‌లోని చీఫ్ ఎలక్షన్ కార్యాలయంలో పనిచేసి బదిలీపై జిల్లాకు వచ్చారు. జిల్లా పై పూర్తిగా అవగాహన తెచ్చుకుని ప్రభు త్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలు అన్ని వర్గాల ప్రజలకు సమర్థవంతంగా అం దేలా విధులు నిర్వహించాలని కలెక్టర్ సూచించారు.

జిల్లా వైద్యాధికారిగా పల్వాన్ కుమార్



సిద్దిపేటటౌన్, అక్టో బరు 29 (ఆంధ్ర జ్యోతి): సిద్దిపేట జిల్లా వైద్యాధికారిగా డాక్టర్ పల్వాన్ కుమార్‌ను నియమిస్తూ మంగళ వారం ప్రభుత్వం ఉత్త ర్వులను జారీ చేసింది. వికారాబాద్ జిల్లా ఇన్‌చార్జి డీఎంహెచ్‌వోగా, మెదక్ జిల్లా అదనపు డీఎంహెచ్‌వోగా ఆయన విధులు నిర్వర్తిస్తున్నారు. ఇప్పటి వరకు సిద్దిపేట జిల్లా ఇన్‌చార్జి డీఎంహెచ్‌వోగా నల్గొండ డీఎంహెచ్‌వో డాక్టర్ పుట్ల శ్రీనివాస్ బాధ్య తలు నిర్వర్తించారు.



కొనుగోలు కేంద్రాలకు మిల్లులను కేటాయించకపోవడంతో ధాన్యం తూకం వేసి హుస్నాబాద్‌లోని సివిల్ సప్లయ్ గోదాములో నిల్వ చేస్తున్న అధికారులు

ధాన్యం దళారులపాలు!

'కొండపాక మండలం దమ్మక్కపల్లిలో రైతులు 10 రోజుల క్రితమే వరి కోసి ధాన్యం ఆరబెట్టారు. అక్కడ ఇప్పటి వరకు కూడా ప్రభుత్వం తరఫున కొనుగోళ్లు చేపట్టలేదు. వర్షం బారిన పడకుండా కంటిపై రెప్ప వేయ కుండా రైతులు కాపాడుకుంటూ వస్తున్నారు. చివరకు రూ.1900 నుంచి రూ.2100 వరకు క్వింటాల్ చొప్పున ప్రైవేట్ వ్యాపారు లకు అప్పగించారు. సంచికి హమాలీ ఖర్చు రూ.45, కిలోన్నర కటింగ్ తప్పనిసరి.'

'బెజ్జంకి మండలంలో ఐకేపీ, పీఏసీఎస్ ఆధ్వర్యంలో 19 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి ప్రారంభించారు. కేవలం బెజ్జంకి వ్యవసాయ మార్కెట్‌లో మాత్రమే సోమవారం నుంచి కొనుగోలు ప్రారంభిం చారు. మిగితా సెంటర్లలో ప్రారంభించకపోవ డంతో రైతులకు ఎదురుచూపులు తప్పడం లేదు. ధాన్యం తెచ్చి వారం, పది రోజులవు తున్నా కొనుగోలు చేపట్టడం లేదని ఆవేదన చెందుతున్నారు.'

- క్వింటాల్ రూ.1900 చొప్పున విక్రయం
- కేంద్రాలను ప్రారంభించినా కొనుగోళ్లలో జాప్యం
- రోజుల తరబడిగా ఎదురుచూస్తున్న అన్నదాతలు
- జిల్లాలో జోరుగా వరి కోతలు
- అధికారులు దృష్టిసారిస్తేనే మేలు

ఆంధ్రజ్యోతి ప్రతినిధి, సిద్దిపేట, అక్టోబరు 29 : వరి కోతకు రావ డంతో రైతుల్లో ఓ వైపు సంతోషం.. మరోవైపు సందిగ్ధం నెలకొన్నది. ప్రభుత్వం కొనుగోళ్లు ప్రారంభించక, వర్షాలకు పంట దెబ్బతింటుం డడంతో సరైన ధర రాకపోయినా ధాన్యాన్ని విక్రయించేందుకు దళా రుల వైపు మొగ్గుచూపుతున్నారు. తొగుట, బెజ్జంకి మండలాల్లో నెలకొన్న పరిస్థితులే అందుకు అద్దం పడుతున్నాయి.

జిల్లాలో 3.68 లక్షల ఎకరాల్లో వరి సాగు చేశారు. మొత్తంగా 8 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం వస్తుందని అంచనా వేశారు. ఇందులో సగం మేర అంటే 4లక్షల టన్నుల ధాన్యాన్ని ఐకేపీ, పీఏసీఎస్, మార్కెట్ల ద్వారా కొనుగోలు చేయడానికి ప్రణాళిక రచిం చారు. అయితే, ఈ ధాన్యం కూడా దళారుల పాలయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. గడిచిన 15 రోజుల నుంచే జిల్లాలో వరి కోతలు మొదలయ్యాయి. ఇందులో భాగంగానే అధికారులు కొనుగోలు కేంద్రాలను కూడా ఏర్పాటు చేశారు. కానీ కేంద్రాల్లో ధాన్యం కొను గోళ్లు చేపట్టలేదు. ఈ విషయం తెలిసి రైతులు దళారులను ఆశ్ర యించాల్సి వస్తోంది. జిల్లావ్యాప్తంగా 417 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని నిర్ణయించి ఇప్పటికీ 290 కేంద్రాలను ఏర్పాటు చేశారు. కానీ, అధికారికంగా ధాన్యాన్ని కొనుగోలు చేయడం లేదు. అక్కడక్కడ కొనుగోలు చేసిన ధాన్యాన్ని మిల్లర్లకు తరలించే పరి స్థితి లేకపోవడంతో ప్రభుత్వ గోదాముల్లోనే తరలించడానికి సన్నా హాలు చేస్తున్నారు.

మిల్లర్లపైనే ఆధారమా..

కేంద్రాలు ఏర్పాటు చేసినప్పటికీ ధాన్యం కొనుగోలు ప్రారంభిం చకపోవడం వెనుక రైస్‌మిల్లర్లతో ఒప్పందం జరగకపోవడమే కార ణంగా తెలుస్తోంది. ఈ సీజన్ నుంచే సన్నవడ్లకు ప్రభుత్వం బోనస్ ప్రకటించడం, సన్నవడ్లను మిల్లింగ్ చేసి సీఎంఆర్ రైస్ అప్పగించడం, దొడ్డు వడ్లను గడువులోగా మరపట్టించి ఇవ్వడం తదితర అంశాలపై తర్జనభర్జన నెలకొన్నది. ఈ క్రమంలోనే కేంద్రాల్లో కొనుగోళ్లు చేయడం లేదన్నట్లుగా తెలుస్తోంది. అయితే కొన్ని చోట్ల కొనుగోలు ప్రారంభించి మిల్లుల్లోకి కాకుండా వ్యవ

మిగతా 8వ పేజీలో...



నారాయణరావుపేట మండలం జక్కాపూర్ ఐకేపీ కేంద్రంలో ఆరబెట్టిన ధాన్యం

గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలు

- రైతులను మోసం చేస్తే కఠిన చర్యలు
- రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం

హుస్నాబాద్‌రూరల్, అక్టోబరు 29, (ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోళ్లలో రైతులకు ఇబ్బంది లేకుండా గ్రామాల్లో కొను గోలు కేంద్రాలను ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిందని రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. మంగళవారం హుస్నాబాద్ మండలం మీర్జాపూర్‌లోని జిన్నింగ్ మిల్లులో సీసీఐ ద్వారా ఏర్పాటు చేసిన పత్తి కొనుగోలు కేంద్రాన్ని మంత్రి పొన్నం కలెక్టర్ మనుచౌదరితో కలిసి ప్రారంభించారు. ఈ సంద ర్భంగా మంత్రి మా ట్లాడుతూ ప్రభుత్వం సన్నవడ్లకు రూ.500 బోనస్ ఇస్తుందని తెలిపారు. రూ.2లక్షల లోపు రుణాలు ఉన్న రైతులందరికి డిసెంబర్‌లోపు మాఫీ చేస్తాం దన్నారు. రూ.2లక్షల పైన ఉన్న రైతుల వివరాలు సేకరించి వారికి కూడా రుణమాఫీ చెల్లించేందుకు రాష్ట్ర కేబినెట్ నిర్ణయం తీసుకుందని తెలిపారు. కొనుగోళ్లలో రైతులను ఇబ్బంది పెట్టినట్లు తెలిస్తే తనకు ఒక్క మెస్సేజ్ చేస్తే తక్ష ణమే స్పందిస్తానని చెప్పా రు. పత్తి రైతులు ఇబ్బందులు పడకుండా కొనుగోళ్లకు సంబంధించిన అన్ని సౌకర్యాలు రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేస్తుందని, కాని పత్తి కొనుగోలు చేసేది కేంద్ర ప్రభుత్వం గనుక రాష్ట్రంలో 322 పత్తి కొను గోలు కేంద్రాల ఏర్పాటుకు కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్ కృషి చేయాలని మంత్రి విజ్ఞప్తి చేశారు. రైతులు అవసరాల అనుగుణంగా వ్యవసాయసాగుకు సంబంధించిన సాంకేతిక పరికరాలు అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. పత్తి రైతులు వచ్చే సెప్టెం బర్ వరకు తమ పత్తిని అమ్ముకొవచ్చని ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. తేమ శాతం 8-12 మధ్య ఉండే విధంగా ఆరబెట్టి కొనుగోలు కేంద్రాలకు తీసుకురావా లని కోరారు. స్థానిక నాయకులు పార్టీలకు అతీతంగా రైతుల సంక్షేమం కోసం సహకరించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ కేడం లింగమూర్తి, ఆర్డీవో రాంమూర్తి, మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజిత, వైస్‌చైర్‌ప ర్సన్ అయిలేని అనిత, సింగిల్‌విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య, చిత్తారి పద్మ, తహసీల్దార్ రవీందర్‌రెడ్డి, కౌన్సిలర్లు, సీసీఐ అధికారులు ఉన్నారు.

ధాన్యం వచ్చిన వెంటనే దిగుమతి చేసుకోవాలి

హుస్నాబాద్ : ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల నుంచి లారీల్లో గోదాంకు వచ్చిన ధాన్యాన్ని వెంటనే దిగుమతి చేసుకోవాలని కలెక్టర్ మను చౌదరి ఎంఎల్ఎస్ పాయింట్ ఇన్‌చార్జిని ఆదే శించారు. మంగళవారం ఆయన హుస్నాబాద్ వ్యవసాయ మార్కెట్ యార్డులోని గోదాములను పరిశీలించారు. ఆరు షెడ్‌లకు ఒకటి మాత్రమే ఖాళీగా ఉందని మిగతా వాటిలో ఏమున్నాయే వివరాలు ఇవ్వాలని సూచించారు. వరి ధాన్యం ఎక్కువగా వచ్చే సూచనలు కనిపిస్తున్నందున షెడ్‌లు ఖాళీ గా ఉంచేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఆయన వెంట ఆర్డీవో రామ్మూర్తి, తహసీల్దార్ రవీందర్‌రెడ్డి ఉన్నారు.

ప్రయోగాత్మక పాఠం

- వినూత్నం భౌతికశాస్త్ర ఉపాధ్యాయుడు చిన్నబ్రహ్మయ్య బోధన 7
- పాఠానికి ముందు ప్రయోగం ఉండాల్సిందే
- విద్యార్థుల్లో పెరుగుతున్న ఆసక్తి



చెరిగిపోతున్న చరిత్ర ఆనవాళ్లు

- శిథిలమైపోతున్న బురుజులు
- రాబోయే తరాలకు అపార నష్టం
- దిద్దుబాటు చర్యలు చేపట్టకపోతే కాల గర్భంలో కలిసే ప్రమాదం 8



స్పెషల్ ఎడ్యుకేషన్ అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన 7



కబడ్డీ.. కబడ్డీ..

సిద్దిపేట ప్రభుత్వ బాలుర పాఠశాల మైదానంలో ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో 68వ జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు ప్రారంభమ య్యాయి. అండర్ 14, అండర్ 17 విభాగాల్లో 26 మండలాల నుంచి 1100 మంది క్రీడాకారులు పోటీల్లో పాల్గొన్నారు. ఈ పోటీల్లో ప్రతిభ కనబరిచిన వారు నవంబరు 1న జరిగే ఉమ్మడి జిల్లా స్థాయి పోటీ లకు సెలెక్ట్ అవుతారని జిల్లా ఎస్ జీఎఫ్ ఆర్గనైజింగ్ సెక్రటరీ సౌందర్య తెలిపారు. ఈ కార్యక్రమా నికి ముఖ్యఅతిథిగా డీఈవో శ్రీనివాస్‌రెడ్డి హాజరై మాట్లాడారు.

- సిద్దిపేట కల్చరల్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి)



నిబంధనలు తుస్స్

- జనావాసాలకు దగ్గరగా టపాసుల స్టాల్స్ ఏర్పాటు
- కిరాణషాపులు, బుక్ షాపుల ముందు విక్రయాలు

సిద్దిపేటకల్చరల్/సిద్దిపేట క్రైం 29 (ఆంధ్రజ్యోతి) : సిద్దిపేటలో దీపావళి సందడి మొదలైంది. దీపావళి అంటేనే టపాసుల చప్పుళ్లు.. తారాజువ్వల వెలుగులు.. చిన్నాపెద్దా తేడా లేకుండా పండుగను బాణాసంచా కాలుస్తూ ఎంజాయ్ చేస్తారు. ఇదే అదునుగా పట్టణ కేంద్రాల్లో బాణసంచా దుకాణ దారులు ఇబ్బడి ముబ్బడిగా స్టాల్స్ ఏర్పాటు చేసి విక్రయాలు చేపడుతు న్నారు. వాస్తవానికి ఒక బాణసంచా స్టాల్ పెట్టి టపాసులు విక్రయించా లంటే సంబంధిత శాఖల నుంచి అవసరమైన అనుమతులు, పాటించవల సిన నిబంధనలు చాలా ఉంటాయి. కానీ, ఎక్కడా కూడా అన్ని అనుమ తులు పొందినట్లు, జాగ్రత్తలు పాటించిన దాఖలాలు కనిపించడం లేదు. బాణాసంచా దుకాణ సముదాయాలను జనావాసాలకు దూరంగా ఉండేలా శివారు ప్రాంతాల్లో ఏర్పాటు చేయాలనే ముఖ్యమైన రూల్‌నే బ్రేక్ చేస్తూ స్టాల్స్ ఏర్పాటు చేస్తున్నారు. పట్టణంలోని సుభాష్ రోడ్డు, మెదక్ రోడ్డు, సాయిబాబా ఆలయం వద్ద బాణసంచా దుకాణ సముదాయాల ఏర్పాటుకు పనులు చకచకా చేస్తున్నారు. సుభాష్ రోడ్డు, గాంధీ సర్కిల్, మెదక్ రోడ్డు వైపు పండుగ సమీపించగానే బెంచీలు వేసి టపాకులు పెట్టి అమ్మేస్తు న్నారు. ఎక్కువ మొత్తంలో సాయిబాబా మందిరం సమీపంలో టపాకా యల విక్రయ స్టాల్స్ ఏర్పాటుకు వ్యాపారులు సిద్ధమవుతున్నారు. స్థాని కులు అభ్యంతరం వ్యక్తం చేసినప్పటికీ అధికారుల అండదండలు ఉండ టంతో స్టాల్స్ వెలుస్తూనే ఉన్నాయి. గతేడాదితో పోలిస్తే ఈ సంవత్సరం స్టాల్స్ మరింత ముందుకు రోడ్డు వైపునకు జరిగాయి. ఈ రోడ్డు వాహనదా రులతో నిత్యం రద్దీగా ఉంటుంది. ప్రభుత్వ ఆసుపత్రి, సాయిబాబ మందిరం డిగ్రీ కళాశాల, క్రికెట్ గ్రౌండ్ ఈ మార్గంలోనే ఉండటం వల్ల జన సంచారం ఎక్కువగా ఉంటుంది. అంతేకాదు అతి సమీపంగా నివాస గృహాలు, వాణిజ్య సముదాయాలు, కొంతదూరంలో ప్రభుత్వ ఆసుపత్రి, సాయిబాబ ఆలయం ఉంటుంది. ఇలాంటి రద్దీగా ఉన్న చోట అనుమతి ఎలా ఇస్తారని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

జాగ్రత్తల ఊసే లేకుండా..

బాణసంచా విక్రయించేందుకు వివిధ అనుమతులు అవసరముంటాయి.





సిద్దిపేటలో ఏర్పాటవుతున్న టపాసుల స్టాల్

పలు జాగ్రత్తలు పాటించాల్సి ఉంటుంది. శివారు ప్రాంతాల్లో దుకాణ సము దాయాలను ఏర్పాటుచేయాలి. దుకాణం పెట్టేందుకు ల్యాండ్ ఓనర్ పర్మిష న్ రెవెన్యూశాఖ నుంచి అనుమతి అవసరముంటుంది. దుకాణాల మధ్య 3 మీటర్ల దూరం ఉండాలి. కమర్షియల్ టాక్స్ చెల్లించినట్లు మున్సిపల్ శాఖ నుంచి, ట్రాఫిక్‌ను నియంత్రించడానికి పోలీస్ డిపార్ట్‌మెంట్ నుంచి పర్మిష న్ తీసుకోవాలి. ముఖ్యంగా అగ్నిమాపక శాఖ నుంచి అనుమతి తప్పనిస రిగా పొందాలి. లైసెన్స్‌లో పొందుపరిచిన విధంగానే సామగ్రిని పెట్టాలి. షాపు దగ్గర్లోనే 200 లీటర్ల సామర్థ్యం కలిగిన వాటర్ నింపిన డ్రమ్ములు, ఇసుక బకెట్లు ఉండాలి. అన్ని నిబంధనలు తప్పనిసరిగా పాటించాలి. కానీ సిద్దిపేట జిల్లాలో అనేక స్టాళ్లు పర్మిషన్లతో పని లేకుండా జాగ్రత్తల ఊసే లేకుండా టపాకులు వ్యాపారం సాగుతోంది.

తప్పనిసరిగా అనుమతి తీసుకోవాలి



సందన్న, జిల్లా అగ్నిమాపకశాఖాధికారి, సిద్దిపేట

బాణసంచా విక్రయదారులు నిబంధలకు లోబడే స్టాల్స్ ఏర్పాటు చేసుకోవాలి. సిద్దిపేటలో 8 షాపులకు పర్మినెంట్ లైసెన్స్‌లు, 11 షాపులు తాత్కాలికంగా ఏర్పాటుకు అనుమతి తీసుకున్నారు. గజ్వేల్‌లో పర్మినెంట్ 3 షాపులు, 23 టెంపరరీ స్టాల్స్, హుస్నాబాద్‌లో పర్మినెంట్ 1 కాగా 8 షాపుల ఏర్పాటుకు తాత్కాలి కంగా అనుమతి తీసుకున్నారు. దుబ్బాకలో 10 షాపులకు టెంపరరీ పర్మిష న్‌కు దరఖాస్తు చేసుకున్నారు. అనుమతి లేకుండా అమ్మకాలు చేపడితే కఠిన చర్యలు తీసుకుంటాం.

వ్యాపారులు జాగ్రత్తలు పాటించాలి

- అనురాధ, కమిషనర్ ఆఫ్ పోలీస్



బాణసంచా దుకాణాలు ఏర్పాటు చేసుకునేవారు కచ్చి తంగా నిబంధనలు పాటించాలి. అంతకుముందు షాపు ఏర్పాటు చేసుకోవడానికి తప్పకుండా పోలీస్ డిపార్ట్‌మెంట్‌తోపాటు సంబం ధితశాఖల అధికారుల నుంచి అనుమతి తీసుకోవాలి. ఎలాం టి ప్రమా దాలూ జరగకుండా ముందు జాగ్రత్తలు పాటించాలి. ట్రాఫి క్ సమస్యలు రాకుండా 15 మీటర్ల దూరంలో పార్కింగ్ ఏర్పాటు చేసుకోవాలి.

ఎట్టకేలకు తలనీలాల సేకరణ వేలం

- కమిషనర్ కార్యాలయంలో నిర్వహణ

చేర్యాల, అక్టోబరు 29, (ఆంధ్రజ్యోతి) : కొమురవెల్లి మల్లన్న ఆలయంలో పలు మార్లు వాయిదాపడిన తలనీలాల సేక రణ వేలంపాట ఎట్టకేలకు దేవాదాయ శాఖ కమిషనర్ కార్యాలయంలో విజ యవంతంగా ముగిశాయి. మల్లన్న ఆలయ సందర్శనార్థం వచ్చే భక్తులు మొక్కుబడిగా సమర్పించిన తలనీ లాల సేకరణకు యేటా వేలం నిర్వహి స్తున్న క్రమంలో ఈయేడాది జాతర నిర్వహణకూ చర్యలు తీసుకుని టెండర్లు పిలిచారు. గతేడాదికన్నా తక్కువ పాట రావడంతో పలుమార్లు వాయిదా పడ్డాయి. గతేడాది టెండర్ నిర్ణీత గడువు ముగి యడంతో మంగళవారం దేవాదాయశాఖ కమిష నర్ కార్యాలయంలో వేలంపాటలు చేపట్టారు. దీంతో సిద్దిపేటకు చెందిన రుద్ర ఎంటర్ ప్రైజస్ రూ.62.37లక్షలకు హెచ్చుపాట పాడ టంతో టెండర్ ఖరారు చేశారు. గత జూలై 7నుంచి ఈనెల31వరకు పోగుచేయనున్న తల నీలాలను కిలో ధర రూ.8,100 చొప్పున కొను గోలు చేయడానికి రుద్ర ఎంటర్ ప్రైజస్ వారు పాటపాడి టెండర్ దక్కించుకున్నారు. కార్యక్ర మంలో ఆలయ ఈవో బాలాజీశర్మ, మెదక్ అసి స్టెంట్ కమిషనర్ చంద్రశేఖర్, సూపరింటెండె ట్‌లు సురేందర్, శ్రీరాములు పాల్గొన్నారు.



వేలంపాట నిర్వహిస్తున్న దేవాదాయశాఖాధికారులు

దేవాదాయశాఖ కమిషనర్‌ను కలిసిన మల్లన్న ఆలయవర్గాలు

దేవాదాయశాఖ కమిషనర్‌గా హనుమంతు కొండిబా నియమితులైన క్రమంలో మల్లన్న ఆలయ ఈవో బాలాజీశర్మ, ఆలయ అర్చకులు, సిబ్బంది మర్యాదపూర్వకంగా కలిసి స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలు అందించారు.

సర్కారు బడులకు కొత్త వంట పాత్రలు

- తీరనున్న మధ్యాహ్న భోజన కార్మికుల కష్టాలు

సంగారెడ్డి అర్బన్, అక్టోబరు29 (ఆంధ్ర జ్యోతి): సర్కారు బడుల్లో మధ్యాహ్న భో జన ఏజెన్సీ కార్మికుల కష్టాలు తీరనున్నా యి. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల హా జరు శాతాన్ని పెంచేందుకు మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేస్తున్న విషం తెలిసిందే. అయితే చాలాచోట్ల కాలం చెల్లి న అల్యూమినియంతో తయారైన వంట పాత్రలు వినియోగిస్తున్నారు. వంట సామగ్రి పాతబడిపోవడంతో వండిన అన్నం, పప్పు, కూరలు అడుగంటి రుచిగా ఉండడం లేదు. ప్రభుత్వం కొత్తగా అన్నం గిన్నెలు, స్టీలు బకెట్లు, గరిటెలు, బొగానా లు తదితర పాత్రల కొనుగోలుకు అవసర మైన నిధులను మంజూరు చేసింది. త్వరలోనే టెండర్లు పిలిచి విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా బడులకు కొత్త పాత్రలను సరఫరా చేయనున్నారు.

ప్రయోగాత్మక పాఠం

- వినూత్నం భౌతికశాస్త్ర ఉపాధ్యాయుడు చిన్నబ్రహ్మయ్య బోధన
- ప్రతీ పాఠానికి ముందు ప్రయోగం ఉండాల్సిందే..
- విద్యార్థుల్లో పెరుగుతున్న ఆసక్తి
- జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయి ప్రదర్శనల్లో రాణింపు



భవాని మూలకాలు చెబుతుంటే టైం చూసి పరీక్షిస్తున్న భౌతికశాస్త్ర ఉపాధ్యాయుడు చిన్న బ్రహ్మయ్య

మర్కుక్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): మర్కుక్ మండలంలోని దామరకుంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న భౌతికశాస్త్ర ఉపాధ్యాయుడు చిన్నబ్రహ్మయ్య పాఠం మొదలుపెడితే చాలు మొదట ప్రయోగం ఉండాల్సిందే. ఇప్పటికే విద్యార్థుల చేత చాలా రికార్డులని నెలకొల్పి గిన్నిస్ బుక్ రికార్డుకు కూడా ఒకే ఒక్క అడుగు దూరంలో ఉన్న ఆయన బోధన తీరు సమ్‌థింగ్ స్పెషల్.

భళారే భవాని...

118 మూలకాలు 14.55 మైక్రో సెకండ్స్‌లో చెప్పడంలో చెన్నైకి చెందిన మహాలక్ష్మి పేరిట ఉన్న గిన్నిస్ బుక్ రికార్డు ఈ పాఠశాల విద్యార్థిని భవాని అధిగమించింది. కేవలం 12.15 మైక్రో సెకండ్స్‌లోనే పూర్తి చేసి పలువురిని ఆశ్చర్యానికి గురి చేసింది. ఈ విద్యార్థిని ప్రతిభను ముందే గుర్తించిన ఉపాధ్యాయుడు చిన్నబ్రహ్మయ్య ప్రోత్సహించారు.

దక్షిణ భారత వైజ్ఞానిక ప్రదర్శనలో..

ఉపాధ్యాయుడు చిన్న బ్రహ్మయ్య ఆధ్వర్యంలో దక్షిణ భారత వైజ్ఞానిక ప్రదర్శనలోనూ ఈ పాఠశాల విద్యార్థులు అద్భుతమైన ప్రయోగాన్ని ఆవిష్కరించారు. పంటకు ఇరువైపులా అతి సులభంగా ఎరువులు వేసే పరికరాన్ని అతి తక్కువ ఖర్చుతో తయారుచేసి ఓ వ్యవసాయ క్షేత్రంలో ఉపయోగించారు. ఈ పరికరంతో రోజుకు ఒక వ్యక్తి దాదాపు 6 ఎకరాల్లో అలసట లేకుండా ఎరువులు చల్లుకోవచ్చు. దీంతో సమయంతో పాటు డబ్బులు కూడా ఆదా కానుండడంతో ఉపాధ్యాయుడు చిన్నబ్రహ్మయ్య రైతుల నుంచి ప్రశంసలు పొందారు. ఇందుకుగానూ భారత హెవీ ఎలక్ట్రికల్ లిమిటెడ్(బీహెచ్‌ఈఎల్) వారు ఈ ప్రయోగానికి ప్రత్యేక బహుమతిని అందజేశారు.

వ్యర్థాలతో వస్తువులు..

వ్యర్థ శీతల పానీయాల డబ్బాల నుంచి నాణ్యమైన వస్తువులను తయారు చేయడంలో ఆయన దిట్ట. వాటి నుంచి సన్నని దారాన్ని తీసి విద్యార్థులచే అతి తక్కువ ఖర్చుతో వ్యవసాయ క్షేత్రాలకు చుట్టూ ఫెన్సింగ్ తీగలు, గృహోపకరణాలు తయారీలో సఫలీకృతులయ్యారు. ఈ ప్రయోగమే 2023 సంవత్సరానికి గాను జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్‌లో జాతీయ స్థాయికి ఎంపిక కాబడింది. కానీ ప్రభుత్వం ఈ సంవత్సరం జాతీయ స్థాయి ప్రదర్శన నిర్వహించకపోవడంతో అది వాయిదా పడింది. 2024 డిసెంబర్‌లో రెండు సంవత్సరాలకు గాను ఒకేసారి ప్రదర్శన ఉండే అవకాశం ముందని మండల విద్యాధికారి వెంకట్‌రాములు తెలిపారు.



జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్‌కు ఎంపికైన సందర్భంగా విద్యార్థులతో పాటు ప్రశంసాపత్రం అందుకుంటున్న చిన్నబ్రాహ్మయ్య

ప్రయోగాలతో పాఠాలపై ఆసక్తి..



ప్రయోగాలతోనే పాఠాలపై విద్యార్థులకు ఆసక్తి కలుగడంతోపాటు విజ్ఞానం పెంపొందుతుంది. వారిలోని సృజనాత్మకతను బాల్య దశ నుంచే వెలికితీసి పదును పెడితే భవిషత్‌లో రాణిస్తారు. అందులో భాగంగానే ఆనందకరమైన అభ్యాసనం అనే ప్రక్రియ ద్వారా కృత్యాధార బోధన చేస్తూ వారిలో విజ్ఞానశాస్త్రంపై సరైన వైఖరిని, ఆసక్తిని పెంపొందించేందుకు కృషి చేస్తున్నాం. ఈ పాఠశాల విద్యార్థులు అనేక రాష్ట్ర జాతీయ స్థాయి బహుమతులు గెలుచుకోవడం చాలా ఆనందంగా ఉంది.

-చిన్న బ్రహ్మయ్య, భౌతికశాస్త్ర ఉపాధ్యాయుడు

సార్‌కు కృతజ్ఞతలు..



నేను పదవ తరగతి చదువుతున్నా. చిన్న బ్రహ్మయ్య సారు మార్గదర్శకత్వంలో జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్-2023లో మేము ప్రదర్శించిన ప్రాజెక్టు జాతీయ స్థాయికి ఎంపికైంది. మాలో భయం పోగొట్టి ప్రయోగాలు చేయిస్తున్న మా సార్‌కి కృతజ్ఞతలు.

-యశ్వంత్, విద్యార్థి

ప్రయోగాత్మకంగా బోధించడంతోనే..



నేను పదవ తరగతి చదువుతున్నాను. చిన్న బ్రహ్మయ్య సారు గత సంవత్సరం అక్టోబరు నెలలో మా పాఠశాలకు వచ్చారు. అప్పటి నుంచి మా పాఠశాల విద్యార్థులు అనేక జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణిస్తున్నారు. సారు ప్రతి అంశాన్ని ప్రయోగపూర్వకంగా బోధించడంతో సులభంగా అర్థమవుతుంది. సారుకు ధన్యవాదాలు.

-రేవతి, విద్యార్థిని

స్పెషల్ ఎడ్యుకేషన్ అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన



సంగారెడ్డిలోని డీఈవో కార్యాలయంలో ధ్రువపత్రాల పరిశీలన ప్రక్రియను పర్యవేక్షిస్తున్న డీఈవో వెంకటేశ్వర్లు

సంగారెడ్డి అర్బన్ /సిద్దిపేట కల్చరల్, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి) : డీఎస్సీ-2024లో మెరిట్ సాధించిన ఎస్టీటీ స్పెషల్ ఎడ్యుకేషన్ అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన మంగళవారం ప్రారంభమైంది. 1:3 మెరిట్ జాబితా ప్రకారం వచ్చిన అభ్యర్థుల ఒరిజినల్ సర్టిఫికెట్లను పరిశీలించారు. ఈ ప్రక్రియను డీఈవోలు వెంకటేశ్వర్లు, శ్రీనివాసరెడ్డి పర్యవేక్షించారు. సిద్దిపేట జిల్లాలో 71 మంది అభ్యర్థులకుగాను మొదటి రోజు 59 మంది ధ్రువపత్రాల పరిశీలన పూర్తయ్యిందని జిల్లా విద్యాధికారి శ్రీనివాస రెడ్డి తెలిపారు. బుధవారం కూడా సర్టిఫికెట్ వెరిఫికేషన్ చేసుకోవచ్చని తెలిపారు. పరిశీలన పూర్తయిన తర్వాత అభ్యర్థుల వివరాలు కంప్యూటరీకరణ చేసి పై అధికారులకు పంపిస్తామని, తదుపరి ఉత్వర్వులు వెలువడ్డాక కౌన్సెలింగ్ ఉంటుందని తెలిపారు. ఈ పరిశీలన ప్రక్రియలో ఏడి వెంకటేశ్వర్ రెడ్డి, కమ్యూనిటీ మోబిలైజింగ్ ఆఫీసర్ రంగనాథ్, జిల్లా గణాంక అధికారి నర్సింలు, ఐఆర్‌పిలు, ప్రధానోపాధ్యాయులు, డిఈవో ఆఫీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మత విద్వేషాలను రెచ్చగొట్టే అధికారి మాకొద్దు

- ఎన్సాన్‌పల్లి గ్రామస్థుల నిరసన



నిరసన తెలుపుతున్న గ్రామస్థులు

సిద్దిపేట అర్బన్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట అర్బన్ మండలం ఎన్సాన్‌పల్లి గ్రామంలో స్పెషల్ ఆఫీసర్‌గా వ్యవహరిస్తున్న మండల అధికారి మతవిద్వేషాలను రెచ్చగొడుతూ గొడవలకు కారణం అవుతున్నారని గ్రామస్థులు ఆరోపిస్తూ మంగళవారం నిరసన తెలిపారు. ఈ ఆఫీసర్ తమకు అవసరం లేదంటూ నినాదాలు చేశారు. గ్రామంలో చర్చికి సంబంధించి గతంలో గొడవ జరుగుతే పోలీస్ సిబ్బంది వచ్చి అట్టి సామగ్రిని ఆఫీస్ లో ఉంచగా మండల అధికారిగా వ్యవహరిస్తున్న వ్యక్తి తాను గ్రామానికి స్పెషల్ ఆఫీసర్ గా ఉన్నారంటూ తాము చెప్పిందే వినాలని అట్టి సామగ్రిని మళ్లీ చర్చి సిబ్బందికి అప్పగించారన్నారు ఆ అధికారిని గ్రామ స్పెషల్ ఆఫీసర్‌గా తొలగించాలని డిమాండ్ చేశారు.

కానిస్టేబుల్ ఇంట్లో చోరీ

- ఎనిమిదిన్నర తులాల బంగారం, 30తులాల వెండి అపహరణ

పెద్దశంకరంపేట, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): కానిస్టేబుల్‌లో ఇంట్లోకి దుండగులు చొరబడి నగలు ఎత్తుకెళ్లారు. వివరాల్లోకి వెళ్తే.. పెద్దశంకరంపేట పరిధి వెంకటేశ్వరకాలనీలో నివాసముంటున్న దంతెల సీమాన్ అల్లాదుర్గం పోలీస్ స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. సోమవారం ఉదయం 9 గంటలకు ఇంటికి తాళం వేసి బయటకు వెళ్లిన అతను మంగళవారం ఉదయం 11 గంటల ఇంటికి తిరిగి రాగా తలుపు తాళం పగులగొట్టి ఉన్నది. లోపలికి వెళ్లి చూడగా బెడ్‌రూంలో బీరువాలోని ఎనిమిదన్నర తులాల బంగారు, 30 తులాల వెండి నగలతోపాటు రూ.15 వేల నగదును కనిపించలేదు. బాధితుడు ఫిర్యాదుతో సంఘటన స్థలాన్ని అల్లాదుర్గం సీఐ రేణుకారెడ్డి, పేట ఎస్ఐ శంకర్ పరిశీలించి వివరాలు సేకరించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

వాకింగ్‌తో రోగాలు మాయం

- ఎక్స్ మిలటరీ అధికారి చౌహాన్ సంగమేశ్వర్
- ఐఐటీహెచ్‌లో వాకథాన్



వాకథాన్‌లో పాల్గొన్న ఎక్స్ సర్వీస్‌మెన్‌లు, ఐఐటీహెచ్ విద్యార్థులు

కంది, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : ప్రతీరోజు అరగంట వాకింగ్ చేస్తే రోగాలు దరి చేరవని ఎక్స్ మిలటరీ చౌహాన్ సంగమేశ్వర్ అన్నారు. సంగారెడ్డి జిల్లా కంది పరిధిలోని ఐఐటీ హైదరాబాద్‌లో శుక్రవారం స్వతకృత్ జాగ్రత్తా స్వత్వాహ్-2024 కార్యక్రమంలో భాగంగా వాకథాన్ అవేర్నెస్ విజిలెన్స్ వీక్ ప్రోగ్రాంను నిర్వహించారు. ఇందులో భాగంగా ఎక్స్ సర్వీస్‌మెన్‌లు, ఐఐటీహెచ్ విద్యార్థులు ఐఐటీహెచ్ ప్రాంగణంలో 5 కిలోమీటర్లు వాకింగ్ చేశారు. ఐఐటీ హెచ్ ఉద్యోగులకు, సిబ్బందికి, విద్యార్థులకు వాకింగ్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎక్స్ మిలటరీ అధికారి చౌహాన్ సంగమేశ్వర్ మాట్లాడుతూ మనం ఎంత బిజీ లైఫ్ గడుపుతున్నా ఆరోగ్య సంరక్షణకు సమయం కేటాయించాలన్నారు. కార్యక్రమంలో ఎక్స్ సర్వీస్‌మెన్‌లు, ఐఐటీహెచ్ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

సర్వేకు ఏర్పాట్లు చేయండి

- అధికారులకు కలెక్టర్ల ఆదేశం

సంగారెడ్డి రూరల్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : సామాజిక, విద్య, ఆర్థిక, ఉద్యోగ, రాజకీయ, కుల అంశాలపై సర్వేకు సంబంధించి అన్ని రకాల ఏర్పాట్లను పకడ్బందీగా చేయాలని మెదక్, సిద్దిపేట, సంగారెడ్డి కలెక్టర్లు రాహుల్‌రాజు, మనుచౌదరి, వల్లూరు క్రాంతి వేర్వేరుగా అధికారులను ఆదేశించారు. ఈ మేరకు మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలతో మంగళవారం సమావేశం నిర్వహించి దిశానిర్దేశం చేశారు. ప్రభుత్వం నవబంరులో ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న సమగ్ర సర్వే కోసం ఎమ్యూనేటర్లు, ఎమ్యూనేటర్ల బ్లాక్, హౌస్ లిస్టింగ్, ప్రణాళికలను సిద్ధం చేయాలని ఆదేశించారు. ఈ సర్వే అన్ని ప్రభుత్వ పథకాల అమలులో కీలక పాత్ర పోషిస్తుందని ఎలాంటి తప్పులు దొర్లకుండా సాధ్యమైనంత త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. 2011 జనాభా గణన అనుసారంగా ఎన్యూమరేషన్ బ్లాక్‌లను ఏర్పాటు చేయాలని, కొత్తగా ఏర్పడిన కాలనీలు ఉన్నట్లయితే బ్లాక్‌లను అప్‌డేట్ చేసుకోవాలన్నారు. , 150 కుటుంబాలకు ఒకరు చొప్పున ఎన్యుమరేటర్లకు నియమించాలన్నారు. ఆయా కార్యక్రమాల్లో అదనపు కలెక్టర్లు మెంచు నగేష్, చంద్రశేఖర్, శిక్షణ కలెక్టర్ మనోజ్, జడ్పీ సీఈవోలు ఎల్లయ్య, జానకి రెడ్డి, డీపీవోలు, ఆర్‌డీవోలు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి



సదరం సర్టిఫికెట్ చూపిస్తున్న దివ్యాంగుడు సమృద్ధి

ఆసరా ఇవ్వండి

- కాళ్లు కోల్పోయి రెండేళ్లయినా పింఛన్ ఇస్తలే
- చేయూతనివ్వాలని దివ్యాంగుడి వేడుకోలు

కోహీర్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) రెండు కాళ్లు కోల్పోయి రెండేళ్లవుతున్నా.. సందరం సర్టిఫికెట్ పొందినా ఆసరా పింఛన్ అందడం లేదని, ఇప్పటికైనా అధికారులు కనికరించాలని సంగారెడ్డి జిల్లా కోహీర్ మండలకేంద్రంలోని ఎక్కల్‌దేవి కుంటకాలనీకి చెందిన కోనాపురం సమృద్ధి ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 2022లో ట్రైన్‌లో నుంచి జారిపడి తన రెండు కాళ్లు కోల్పోయాడు. దీంతో అతడికి సేవ చేయలేనని భార్య పుట్టింటికి వెళ్లిపోయింది. అతని తండ్రి కూడా ముందే చనిపోవడంతో ప్రస్తుతం తన తల్లి నర్సమ్మనే అన్ని తానై చూసుకుంటున్నది. కూలి పనికి వెళ్తూ వచ్చిన డబ్బులతో సమృద్ధిని పోషించుకుంటున్నది. ప్రస్తుత ప్రభుత్వం కనీసం చేయూత పథకం నుంచైనా దివ్యాంగుల పింఛన్ మంజూరు చేస్తే జీవనోపాధికి ఆసరాగా ఉంటుందని వికలాంగుడు సమృద్ధి వేడుకుంటున్నారు.


చేపల వేటకు వెళ్లి యువకుడు మృతి



షకీల్ (ఫైల్)

చేగుంట, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : చేపల వేటకు వెళ్లి యువకుడు మృతి చెందిన సంఘటన నార్సింగి మండల కేంద్రంలో చోటు చేసుకుంది. ఎస్సై అహ్మద్ మొహివుద్దిన్ తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన సయ్యద్ షకీల్ (27) ప్లంబర్‌గా జీవనం సాగిస్తున్నాడు. మంగళవారం సాయంత్రం మిత్రుడు కండ్లకోయ అశోక్‌తో కలసి స్థానిక కామిని చెరువులో చేపల వేట కోసం వెళ్లాడు. చేపల కోసం వేసిన వల తీస్తుండగా కాళ్లకు చుట్టుకోవడంతో నీట మునిగి మృతి చెందాడు. మృతుడి తండ్రి సాజిద్ ఫిర్యాదు మేరకు ఎస్సై కేసు నమోదు చేసుకుని మృతదేహన్ని పోస్టు మార్టం నిమిత్తం రామాయంపేట ఎరియా ఆస్పతికి తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది

పాముకాటుతో బాలుడు..



చింటూ (ఫైల్)

కల్హేర్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): మెదక్ జిల్లా సిర్గాపూర్ మండల పరిధి లోని తోల్యా తాండాలో పాముకాటుతో మంగళవారం 12 ఏళ్ల బాలుడు మృతి చెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి. తండాకు చెందిన లంబాడి గోవింద్ అనే రైతు కుమారుడైన చింటూ ఓ ప్రైవేట్ పాఠశాలలో చదువుతున్నాడు. మంగళవారం బడికి వెళ్లకుండా తల్లిదండ్రులతో కలిసి చేను వద్దకు వెళ్లాడు. తల్లిదండ్రులు పత్తి తీస్తుండగా, చింటూ సహాయం చేస్తున్నాడు. ఈ క్రమంలో పాముకాటు వేసింది. తల్లిదండ్రులు గమనించి వెంటనే నారాయణఖేడ్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా.. అక్కడ చింటూ మృతి చెందాడు.

ఉపాధిహామీలో అక్రమాలు

- పనులు చేయని వారికి కూలీ డబ్బుల చెల్లింపు...
- ఖేడ్ ప్రజా వేదికలో బహిర్గతం



ప్రజా వేదికలో అక్రమాలు వివరిస్తున్న గ్రామస్థులు

నారాయణఖేడ్, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకం ద్వారా పనులు చేయక పోయినా వారి పేర్లపై నిధులు స్వాహా చేవారు. మంగళవారం నారాయణఖేడ్ ఎంపీపీ ఆవరణలో నిర్వహించిన ప్రజా వేదికలో ఈ విషయం బహిర్గతమైంది. 14వ విడత సామాజిక తనిఖీని గ్రామాల వారీగా నిర్వహించిన అనంతరం మండల స్థాయి ప్రజా వేదికలో గ్రామాల వారీగా డీఆర్పీలు తమ నివేదికలు చదివి వినిపించారు. మండలపరిధిలోని వెంకటాపూర్‌లో జరిగిన అవినీతి అక్రమాలను కూలీల వారీగా తెలిపారు. పలువురు కూలీలు హైదరాబాద్, సంగారెడ్డి, జహీరాబాద్, నారాయణఖేడ్ పట్టణంలో ఉన్నప్పటికీ వారి పేర్లను నమోదు చేసి నిధులు దుర్వినియోగం చేసినట్లు తెలిపారు. వీరు పనులు చేయకున్నా చేసినట్లు గ్రామ సభలో వెల్లడించినట్లు, సామాజిక తనిఖీ అధికారిణి వివరించారు. ఈ విషయమై సభలోనే ఇరు వర్గాల మధ్య వాగ్వాదం జరిగింది. దీంతో విచారణ అధికారులు జోక్యం చేసుకొని, పనులు చేసిన వారి పేర్లపై నమోదు చేయగా, హాజరైన వారిని పిలిచి ఏయే పనులు చేశారని ప్రశ్నించారు. వారు చెప్పిన పనులకు రికార్డుల్లో నమోదైన పనులకు పొంతన లేకపోవడంతో అక్రమాలు జరిగినట్లు నిర్ధారించారు. కొన్ని కుటుంబాల్లో అదనంగా జాబ్ కార్డులు జారీ చేసినట్లు తేలింది. వంద రోజులు దాటినా కూలీ డబ్బులు చెల్లించడంపై నిలదీశారు. కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ప్రజా వేదికలో అక్రమాలను వెల్లడిస్తున్న సామాజిక తనిఖీ బృందం

అందినకాడికి మెక్కేశారు..!

- మృతి చెందిన, బినామీ వారి పేరుతో ఉపాధి నిధులు స్వాహా

అల్లాదుర్గం. అక్టోబరు29 (ఆంధ్ర జ్యోతి). బినామీ కూలీలు, విద్యార్థులు, మృతిచెందిన వారి పేర్లతో ఉపాధి నిధులు కాజేసిన వైనం అల్లాదుర్గంలో మంగళవారం నిర్వహించిన సామజిక తనిఖీ ప్రజావేదికలో వెలుగు చూసింది. 2021లో అల్లాదుర్గంలో ఓ వ్యక్తి మరణించగా అతడి పేరుతో ఉపాధి పనులు చేపట్టినట్లు మాస్టర్‌లో పొందుపరిచి అతడి పెరుతోను అక్రమాలకు పాల్పడినట్లు వారు వివరించారు. పనులకు హాజరు కానప్పటికీ ఒకే కుటుంబంలో వృద్ధులు, కుటుంబ సభ్యుల పేర్లతో డబ్బులు దండుకున్నట్లు తేలిపారు. హైదరాబాద్ లో చెరుకు బండి వ్యాపారం చేస్తున్న వారి పేరు తోను డబ్బులు కాజేసినట్లు తేలింది.

రికవరీ చేస్తామన్న అధికారులు

2023-24 సంవత్సరం నకు సంబంధించిన ఉపాధి పనుల్లో అక్రమాలకు పాల్పడినవారి నుంచి రికవరీ చేస్తామని ఏపీడీ రంగాచారి తెలిపారు. కాజేసిన రూ.3,74,620 రికవరీ చేయడంతోపాటు రూ.59.100 జరిమానా విధిస్తూన్నామని తెలిపారు. కార్యక్రమంలో డీవీవో శ్రీహరి, ఎంపీడీవో చంద్రశేఖర్, ఏపీవో సుధాకర్, ఎస్‌టీఎం దత్తు, ఎస్‌ఆర్‌పీ రాజు తదితరులు పాల్గొన్నారు

శ్మశానవాటికకు దారేది?



ముండ్ల పొదలతో బురద మయంగా మారిన దారి

ముళ్ల పొదలతో దారి కనుమరుగు

ఏళ్లుగా రైలుపట్టాల పై నుంచే అంతిమయాత్ర

విన్నవించినా పట్టించుకోని అధికారులు

కోహీర్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : శ్మశానవాటికకు దారిలేక అంతిమయాత్రకు అవస్థలు తప్పడంలేదు. సంగారెడ్డి జిల్లా మండల కేంద్రమైన కోహీర్‌లోని ఎక్కల్‌దేవికుంటకాలనీ నుంచి అర కిలోమీటరు దూరంలో ఉన్న శ్మశాన వాటికకు వెళ్లే దారి ముళ్ల, పిచిమొక్కల పొదళ్ల, బురదతో కనుమరుగైంది. దీంతో కాలనీలో ఎవరైనా చనిపోతే అంతిమయాత్రకు ఏదోలాగా ఆదారి గుండానైనా వెళ్లాలి.. లేదంటే రైలు పట్టాలపై నుంచైనా వెళ్లాలి. అయితే కాలనీవాసులు తప్పని పరిస్థితుల్లో రైలు పట్టాలపై యాత్ర కొనసాగిస్తున్నారు. రైలు వచ్చినప్పుడు పట్టాల పక్కకు అంతిమయాత్రను కూడా ఆపాల్సిన దుస్థితి నెలకొన్నది. శ్మశనానికి వెళ్లే దారిని బాగు చేయాలని ఆ కాలనీవాసులు చాలా సంవత్సరాలుగా రెవెన్యూ అధికారులు, ప్రజాప్రతినిధులకు విన్నవించినా పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి దారిని బాగు చేయాలని ఆ కాలనీవాసులు కోరుతున్నారు.

రైలు పట్టాలపై నుంచి అంతిమయాత్ర (ఫైల్)



ఇబ్బందులు పడుతున్నాం

శ్మశాన వాటికకు సరైన దారి లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. తప్పని పరిస్థితుల్లో రైలు పట్టాలపై నుంచి అంతిమయాత్ర కొనసాగించాల్సిన దుస్థితి నెలకొన్నది. పాడైన రోడ్డును బాగు చేయాలని పలుమార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదు.

- శ్రీను, ఎక్కల్‌దేవికుంట కాలనీవాసి

కొన్నేళ్లుగా తప్పని అవస్థలు..



శ్మశాన వాటికకు వెళ్లేదారి సరిగా లేక ఏళ్ల కొద్ది అవస్థలు పడుతూనే ఉన్నాం. పాలకులు మారినా సమస్య పరిష్కారం కావడంలేదు. ఇప్పటికైనా అధికారులు, పాలకులు స్పందించి మా కాలనీ శ్మశానవాటిక దారి సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలి.

- ఆనంద్, ఎక్కల్‌దేవికుంట కాలనీవాసి

చెరువులో దూకి వ్యక్తి ఆత్మహత్య

కొండపాక, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): ఆర్థిక ఇబ్బందులతో ఓ వ్యక్తి చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన మండలంలోని సిర్సనగండ్ల మంగళవారం చోటుచేసుకుకున్నది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన పొన్నం కొండయ్య (50) అనే వ్యక్తి పది నెలల క్రితం కూతురి వివాహం కోసం అప్పులు చేశాడు. అవి తీర్చే మార్గం లేకపోవడంతో పాటు మద్యానికి బానిసైయ్యాడు. మంగళవారం మద్యం సేవించి గ్రామంలోని చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. చెరువు సమీపంలో అతడి చెప్పులు ఉండడంతో గజ ఈతగాళ్ల సహాయంతో గాలించగా మృతదేహం లభ్యమయింది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడి తల్లి లింగవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

పోలీస్ పికెటింగ్

కొండపాక, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): మండలంలోని తిమ్మారెడ్డిపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని సార్లవాడలో పోలీస్ పికెటింగ్ ఏర్పాటు చేశారు. ఆదివారం రాత్రి ఓ ప్రార్థన మందిరాన్ని గుర్తుతెలియని వ్యక్తులు కూల్చివేశారన్న విషయమై ఎలాంటి అల్లర్లు జరగకుండా పోలీసు అధికారులు పోలీస్ పికెటింగ్ ఏర్పాటు చేశారు. ఈ విషయమై పోలీసు అధికారులు రెండు రోజుల నుంచి విచారణ చేస్తున్నారు.

చెరిగిపోతున్న చరిత్ర ఆనవాళ్లు

- శిథిలమైపోతున్న బురుజులు
- రాబోయే తరాలకు అపార నష్టం
- దిద్దుబాటు చర్యలు చేపట్టకపోతే కాల గర్భంలో కలిసిపోయే ప్రమాదం

చిన్నకోడూరు, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): పురాతన కట్టడాలు నేటి తరానికి గత చరిత్రను తెలియజేస్తాయి. రాష్ట్రంలోని పలు పల్లెల్లో పూర్వం రక్షక కవచాలుగా బురుజులు, గడీలు ఉండేవి. రాజులు గ్రామాల్లో బురుజులు నిర్మించి వాటిపై సైనికులను కాపలా పెట్టేవారని, బురుజులలో యుద్ధ సామగ్రిని నిల్వ ఉంచుతారని చరిత్ర చెబుతుంది.

తెలంగాణ పల్లెల్లో నేటికి వీటికి ప్రత్యేకమైన గుర్తింపు ఉంది. చరిత్రకు అనవాళ్లుగా ఉండే బురుజులు నేడు శిథిలావస్థకు చేరుతున్నాయి. ఆనాటి నిర్మాణ శైలిని భావితరాలకు తెలిపే పురాతన కట్టడాలను పట్టించుకునే నాథుడే లేక కూలిపోతున్నాయి. దీంతో చరిత్ర ఆనవాళ్లు కనమరుగయ్యే ప్రమాదం దాపురించింది. మండలంలోని చిన్నకోడూరు, అల్లీపూర్, ఇబ్రహీంనగర్, ఓబులాపూర్, గ్రామాల్లో ఎంతయిన బురుజులు ఉన్నాయి.

ఆనాటి నైపుణ్యాలకు నిలువుటద్దం

బురుజుల నిర్మాణాలు పరిశీలిస్తే ఆకాశాన్ని తాకుతూన్నట్లు అనిపిస్తాయి. పూర్వ కాలంలో ఎలాంటి టెక్నాలజీ (మిషన్స్) లేని కాలంలో అంత ఎత్తుకు రాళ్ల ఎలా చేర్చారు, మనుషులతో కట్టించినవేనా, ఆ నిర్మాణం ఎలా సాధ్యమైందో అనే సందేహం మనకు కలుగక మానదు. ఆ కట్టడాలను చూస్తుంటే పూర్వీకుల నైపుణ్యం మన కళ్లకు కట్టినట్టు కనబడుతుంది.



చిన్నకోడూరులో శిథిలావస్థలో బురుజు



ఓబులాపూర్‌లో చెట్లు పెరిగి, బీటలు వారిన బురుజు

చతురస్రాకారం, వృత్తాకారంలో...

పూర్వ కాలంలో ఎంతయిన బురుజులను ప్రాంతాల రక్షణ కోసం నిర్మించి, శత్రువుల రాకను అంచనా వేసేవారని చరిత్ర ద్వారా తెలుస్తున్నది. రాళ్లను ఒకదాని పై ఒకటి వరుసలుగా పేర్చి చతురస్రాకారంగా, వృత్తాకారంగా బురుజులు నిర్మించారు. ఈ బురుజుల పై సైనికులు కాపలా ఉండేవారని పూర్వీకులు చెబుతుంటారు. పేర్చిన రాళ్ల వరుసలపై మట్టితో గోడలను నిర్మించారు. రాళ్లను అంత ఎత్తుకు చేర్చేందుకు ఏనుగులను ఉపయోగించేవారని చరిత్త ద్వారా అవగతం అవుతుంది.

బురుజులపై పట్టింపేది

గత చరిత్రకు సాక్ష్యాలైన బురుజులను పట్టించుకోకపోవడంతో రాళ్ల మధ్య నుంచి చెట్లు పెరిగి ఆ చెట్ల వేర్లు రాళ్లను, మట్టిని పెకిలించడంతో బీటలు వారి శిథిలావస్థకు చేరువయ్యాయి. దీంతో బురుజు ఏ సమయంలో కూలి ఎలాంటి ప్రమాదం జరుగుతుందోనని స్థానికులు భయాందోళనకు గురవుతున్నారు. నాటి చరితను రేపటి భవిష్యత్ తరాలకు చేరవేసే బురుజులు కనుమరుగు కాకముందే కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని, ఆ దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకోని, బురుజులను సంరక్షించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

ఉద్యోగ సమయంలోని సేవలే గుర్తింపు తెస్తాయి



జగత్‌కుమార్‌రెడ్డి దంపతులను సన్మానిస్తున్న సుబ్బారాయుడు

సిద్దిపేట కలెక్టరేట్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి జగత్‌కుమార్‌రెడ్డి సేవలు మరువలేనివని, 37 సంవత్సరాలు ఉద్యోగ జీవితంలో మచ్చలేని వ్యక్తిగా సేవలు చేశారని పశుసంవర్ధకశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ సుబ్బారాయుడు అన్నారు. జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి జగత్‌కుమార్‌రెడ్డి ఈనెల 31 న ఉద్యోగ విరమణ చేయనున్నా నేపథ్యంలో మంగళవారం సిద్దిపేటలోని విపంచి కళానిలయంలో జగత్ కుమార్‌రెడ్డి దంపతులను సన్మానించారు. కార్యక్రమంలో జడ్పీ చైర్ పర్సన్ రోజా రాధాకృష్ణ, జిల్లా ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

జిల్లా ఖజానాశాఖ అధికారి బాలరాజు, జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి జగత్‌కుమార్‌రెడ్డి ఇరువురు అంకితభావంతో విధులు నిర్వహించి సమర్థవంతమైన అధికారులుగా గుర్తింపు పొందారని కలెక్టర్ మనుచౌదరి అన్నారు. జిల్లా ఖజానాశాఖ అధికారి ఎన్. బాలరాజు, జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి జగత్‌కుమార్‌రెడ్డి ఉద్యోగ విరమణ కార్యక్రమాన్ని కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్, జిల్లా అధికారులు నిర్వహించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్, డీఆర్వో నాగరాజమ్మ, జిల్లా అటవీశాఖ అధికారి శ్రీనివాస్, డీఆర్డీఏ జయదేవ్ ఆర్య, డీపీవో దేవకీదేవి, డీఎస్డీవో కవిత, సెట్విన్ అధికారి అమీనా, జిల్లా హార్టికల్చర్ అధికారి సువర్ణ, జిల్లా సంక్షేమ అధికారి శారద, డీఎస్‌వో తనూజ, డీఎం సివిల్ సప్లై ప్రవీణ్ పాల్గొన్నారు.

ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో స్నాతకోత్సవం

కుకునూరుపల్లి, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో ప్రధానమంత్రి విశ్వకర్మ స్నాతకోత్సవం నిర్వహించారు. ప్రధానమంత్రి విశ్వకర్మ యోజనలో శిక్షణ పొంది ఉత్తీర్ణులైన వారికి మంగళవారం ధ్రువపత్రాలను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ప్రాంతీయ ఉప సంచాలకులు సీతారాములు, జిల్లా పరిశ్రమల జనరల్ మేనేజర్ శ్రీ గణేష్‌రావు హాజరయ్యారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ వెంకటరమణ, వెంకటేశ్వరరావు, సంతోష్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కోహెడ మండల ప్రెస్‌క్లబ్ కార్యవర్గ ఎన్నిక



హరీశ్

కోహెడ, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): సంచలనాలకు ప్రాధాన్యత ఇవ్వకుండా సత్యమైన వార్తలకు జర్నలిస్టులు ప్రాధాన్యత ఇవ్వాలని సీనియర్ పాత్రికేయుడు టీయూడబ్ల్యూజె రాష్ట్ర నాయకుడు కోహెడ ప్రసాద్‌రావు, టీయూడబ్ల్యూజె జిల్లా ఉపాధ్యక్షుడు పున్నం రాజు అన్నారు. మండల కేంద్రంలోని కోహెడ ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం నూతన కార్యవర్గ ఎన్నికలకు వారు హాజరై మాట్లాడారు. సమావేశంలో సీనియర్ జర్నలిస్టులు సూరుకొంటి శ్రీనివాస్‌రెడ్డి, గొరిట్యాల లక్ష్మణ్ ఉన్నారు. కోహెడ ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడిగా ముల్కల హరీశ్, ప్రధాన కార్యదర్శిగా జితేందర్, ఉపాధ్యక్షులుగా వడ్డెపల్లి ప్రశాంత్, రాగుల సతీష్, సహాయ కార్యదర్శిగా నంగునూరి కిరణ్, కోశాధికారిగా కెవై చారి, ప్రచార కార్యదర్శిగా వట్టిపల్లి శ్రీనివాస్‌రెడ్డి, కార్యవర్గ సభ్యులుగా ఎండీ. సర్వర్, గుర్రాల రాజేందర్‌రెడ్డి, పాము నాగరాజు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

కాంగ్రెస్ ప్రభుత్వంలోనే ఉద్యోగాలు

- యూత్ జిల్లా అధ్యక్షురాలు ఆంక్షారెడ్డి

ములుగు, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించడానికి సీఎం రేవంత్‌రెడ్డి కృషి చేస్తున్నారని సిద్దిపేట జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షురాలు ఆంక్షారెడ్డి అన్నారు. మండలంలోని క్షీరాసాగర్ గ్రామానికి చెందిన గ్రామ కమిటీ అధ్యక్షుడు ఆదాస్ మహేందర్ రోడ్డు ప్రమాదంలో గాయపడిన విషయం తెలుసుకున్న ఆమె పరామర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీలను అమలు చేసి చూపించారన్నారు. ఆమెవెంట గజ్వేల్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు కడపల కృష్ణారెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు శంకర్‌రెడ్డి, కృష్ణ, సత్తిరెడ్డి, నవీన్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

'మంత్రిని విమర్శించే నైతిక హక్కు లేదు'

అక్కన్నపేట, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): హుస్నాబాద్ నియోజకవర్గానికి మంత్రి పొన్నం ప్రభాకర్ పది నెలల్లోనే కోట్ల రూపాయలు నిధులు తెచ్చి అభివృద్ధి చేస్తున్నారని, అంత చేస్తున్న మంత్రిని విమర్శించే నైతిక హక్కు మాజీ ఎమ్మెల్యే వొడితెల సతీష్‌కుమార్‌కు లేదని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జంగపల్లి ఐలయ్య అన్నారు. మండల కేంద్రంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పది సంవత్సరాలు అధికారంలో ఉన్నప్పుడు నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయడంలో సతీష్‌కుమార్ విఫలమయ్యారని, గౌరవెల్లి ప్రాజెక్టును ఎందుకు పూర్తి చేయలేదో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. భూ నిర్వాసితులపై పోలీసులతో లాఠీచార్జీలు చేయించి అరెస్టులు చేసి జైలుకు పంపించారని, మీకు గౌరవెల్లి ప్రాజెక్టు పై మాట్లాడే అర్హత లేదన్నారు. నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్న మంత్రి పొన్నంపై మరోసారి ఆరోపణలు చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. ఆయనవెంట మాజీ సర్పంచ్ ముత్యాల సంజీవరెడ్డి, పట్టణ అధ్యక్షులు చింతల మల్లారెడ్డి, మాజీ ఎంపీటీసీ బైరగోని శ్రీనివాస్‌గౌడ్, తదితరులు ఉన్నారు.

ఆలయ భూములు కబ్జా చేశారని ఆందోళన

ములుగు, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): ఆలయ భూములను ఆలయానికే కేటాయించాలని గ్రామస్థులు ఆందళనకు దిగారు. మండల కేంద్రంలోని ములుగులో శివాలయం, హనుమాన్ ఆలయం చుట్టూ ఉన్న సర్వే నెంబర్ 210లో 16 గుంటలు, సర్వే నెంబర్ 203లో 13 గుంటల భూములను గ్రామానికి చెందిన రియల్‌ఎస్టేట్ వ్యాపారులు కబ్జా చేశారని. ధరణిలో తమ పేర్ల మీద ఎక్కించుకున్నారని గ్రామస్థులు ఆరోపించారు. పూర్వం నుంచి భూములు ఆలయం పేరు మీద ఉన్నాయని, ఆ భూములను ఎవరు ఆక్రమించినా సహించేదిలేదని గ్రామస్థులు హెచ్చరించారు.

వైద్యరంగాన్ని పట్టించుకోని ప్రభుత్వం

- ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

చేర్యాల, అక్టోబరు 29: వైద్యరంగాన్ని పట్టించుకోకుండా ప్రభుత్వం పేదల ప్రాణాలతో చెలగాటమాడుతుందని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఆరోపించారు. చేర్యాల పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిని మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా వైద్యులు, సిబ్బందితో సమావేశమై ఆస్పత్రి స్థితిగతులు, వైద్యులు, సిబ్బంది విధుల నిర్వహణ, మందుల కొరత, ఇతరత్రా అంశాలపై సమీక్షించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రోగులను పరామర్శించి వైద్యసేవలపై ఆరాతీశారు. అనంతరం ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ హయాంలో మాజీ సీఎం కేసీఆర్ చొరవతో కేసీఆర్ కిట్, న్యూట్రీషియన్ కిట్ వంటివి అందించడంతో మాతా, శిశుమరణాలు తగ్గి దేశంలోనే రాష్ట్ర వైద్యరంగం ఆదర్శంగా నిలిచిందన్నారు. కాగా బీఆర్‌ఎస్ నాయకురాలు, మాజీ వార్డు సభ్యురాలు బుడిగె విజయ ఇటీవల అనారోగ్యంతో మరణించగా, మృతురాలి కుటుంబసభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ అంకుగారి స్వరూపారాణి, కౌన్సిలర్ మంగోలు చంటి, మండలాధ్యక్షుడు అనంతుల మల్లేశం, నాయకులు పాల్గొన్నారు.



వైద్యులు, సిబ్బందితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

విద్యారంగాన్ని విస్మరించిన ప్రభుత్వం

- ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు రంజిత్‌రెడ్డి



సిద్దిపేట క్రైం: రాస్తారోకో చేస్తున్న నాయకులు

సిద్దిపేట అర్బన్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి పది నెలలు గడుస్తున్నా విద్యారంగాన్ని పట్టించుకోవడం లేదని, విద్యార్థులకు న్యాయం చేస్తామని ఎన్నికల్లో చెప్పిన కాంగ్రెస్ ఇంతవరకు పెండింగ్ స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను విడుదల చేయకపోవడం దురదృష్టకరమని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు ఆముదాల రంజిత్‌రెడ్డి అన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం సిద్దిపేటలో అంబేడ్కర్ విగ్రహం వద్ద దీక్ష చేపట్టారు. కార్యక్రమంలో సిద్దిపేట జిల్లా ఉపాధ్యక్షుడు కొండం సంజీవ్ కుమార్, జిల్లా నాయకులు గుండా అరుణ్, తాడూరు భరత్‌కుమార్, కోనేరు ప్రవీణ్, బత్తుల అభిషేక్‌భాను, తిరుపతి, రంజిత్, రమ్య, సుహాసిని, స్వప్న, విష్ణు పాల్గొన్నారు.

- సిద్దిపేట క్రైం: స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను వెంటనే విడుదల చేయాలని ఏబీవీపీ జిల్లా కన్వీనర్ వివేక్ డిమాండ్ చేశారు. ఏబీవీపీ సిద్దిపేటశాఖ ఆధ్వర్యంలో సిద్దిపేట జిల్లా కేంద్రంలో భారీ ర్యాలీ, రాస్తారోకో నిర్వహించి ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేసి మాట్లాడారు. మూడు సంవత్సరాలుగా దాదాపు రూ.7500 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలున్నా ప్రభుత్వం తమకేమీ పట్టనట్లు వ్యవహరించడం తగదన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆదిత్య, పవన్, నగర కార్యదర్శులు పరుశురాం, రాహుల్, ఫణీంద్ర, సంతోష్, జస్వంత్, భాను, రాజు, రాకేష్, గోవర్ధన్, అక్షిత్, సంజయ్, భీమన్న, ప్రణయ్ విద్యార్థులు పాల్గొన్నారు

బోనస్‌ను సద్వినియోగించుకోవాలి

- ఎమ్మెల్సీ యాదవరెడ్డి

గజ్వేల్ రూరల్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం సన్నవడ్లకు ఇస్తున్న రూ. 500 బోనస్‌ను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్సీ యాదవరెడ్డి అన్నారు. గజ్వేల్ మండలంలోని బంగ్లవెంకటాపూర్, గిరిపల్లి, అక్కారం గ్రామాల్లో మంగళవారం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన ప్రారంభించారు.కార్యక్రమంలో గజ్వేల్ ఏఎంసీ వైస్ చైర్మన్ సర్దార్‌ఖాన్, ఏపీఎం దుర్గాప్రసాద్, సీసీ కుమార్, మాజీ సర్పంచ్ బాపురెడ్డి పాల్గొన్నారు.

- కుకునూరుపల్లి: నాయీ బ్రాహ్మణులు అన్ని రంగాల్లో ముందుండాలని ఎమ్మెల్సీ యాదవరెడ్డి అన్నారు. ధన్వంతరి జయంతి సందర్భంగా నాయీ బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని బస్టాండ్ వద్ద ఏర్పాటు చేసిన జెండాను ముఖ్య అతిథిగా హాజరైన ఆయన ఆవిష్కరించారు. కార్యక్రమంలో మండలానికి చెందిన వివిధ పార్టీల నాయకులు, నాయీ బ్రాహ్మణ సంఘం సభ్యులు పాల్గొన్నారు.
- మద్దూరు: సమాజానికి ఉత్తమ పౌరులను అందించేది ఉపాధ్యాయులేనని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ కూర రఘోత్తంరెడ్డి తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్‌హాల్లో కామిడి శ్రీనివాస్‌రెడ్డి అధ్యక్షతన ఏర్పాటు చేసి స్థానిక ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం బూర్గు శ్రీశైలం ఉద్యోగ విరమణ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైయ్యారు. కార్యక్రమంలో పీఆర్టీయూ ఎమ్మెల్సీ అభ్యర్థి వంగ మహేందర్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు ఇంద్రసేనారెడ్డి, ప్రధాన కార్యదర్శి శశిధరశర్మ, రిటైర్డు ఎంఈవో నర్సింహారెడ్డి, మాజీ సర్పంచ్ జనార్దన్‌రెడ్డి, కాంప్లెక్స్ హెచ్‌ఎం. చంద్రశేఖర్ పాల్గొన్నారు.



గజ్వేల్ రూరల్: కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ యాదవరెడ్డి

- చిన్నకోడూరు: మండలంలోని మాచాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను మంగళవారం ఎమ్మెల్సీ కూర రఘోత్తంరెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జగదీశ్వర్, ఉపాధ్యాయులు ఆయనను శాలువతో సన్మానించారు.

మట్టి దివ్వెలనే వెలిగించాలి

- మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజిత



మట్టి దివ్వెలను చూపుతున్న చైర్‌పర్సన్ రజిత

హుస్నాబాద్ టౌన్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): దీపావళి వేడుకల్లో మట్టి దివ్వెలను వినియోగించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజిత కోరారు. హుస్నాబాద్ పట్టణంలో మంగళవారం నిర్వహించిన స్వచ్ఛ్ దీవాళి, శుభ్ దీవాళి కార్యక్రమంలో మాట్లాడారు. దీపావళి వేడుకల్లో బాణాసంచా తక్కువగా ఉపయోగించి పర్యావరణ కాలుష్యాన్ని తగ్గించాలని హితవు పలికారు. కార్యక్రమంలలో కమిషనర్ మల్లికార్జున్, వైస్ చైర్‌పర్సన్ అయిలేని అనిత, కౌన్సిలర్లు కొంకటి నళినిదేవి, పెరుక భాగ్యరెడ్డి, రత్నమాల, చిత్తారి పద్మ, సరోజన, అయిలేని శంకర్‌రెడ్డి తదితరులున్నారు.

అవినీతి రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలి: శ్రీదేవి



ర్యాలీ నిర్వహిస్తున్న కళాశాల విద్యార్థులు

సిద్దిపేట రూరల్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): అవినీతి రహిత సమాజం కోసం రైతులు, విద్యార్థులు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని తోర్నాల వ్యవసాయ పరిశోధన స్థానం అధిపతి ఎస్. శ్రీదేవి అన్నారు. సిద్దిపేట రూరల్ మండలం తోర్నాలలో మంగళవారం వ్యవసాయ పరిశోధన స్థానం, ఏరువాక కేంద్రం ఆధ్వర్యంలో విజిలెన్స్ వారోత్సవాల్లో భాగంగా రైతులకు, విద్యార్థులకు అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ పరిశోధన స్థానం అధిపతి ఎస్. శ్రీదేవి మాట్లాడుతూ సమాజంలో జరుగుతున్న అవినీతిని అరికట్టేందుకు ప్రతీ అంశంపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఏరువాక కేంద్రం అధిపతి జే. విజయ్, పంచాయితీ కార్యదర్శి జీవన్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయురాలు సరస్వతీ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

'ఓటుహక్కు నమోదు చేసుకోండి'

సిద్దిపేట టౌన్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): పట్టభద్రులు తమ ఓటుహక్కు నమోదు చేసుకోవాలని బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు మేరుడు మహేష్, బీఆర్‌ఎస్‌వీ జిల్లా అధ్యక్షుడు రెడ్డి యాదగిరి, యువత నియోజకవర్గ అధ్యక్షుడు నిమ్మ రజినీకాంత్‌రెడ్డి పిలుపునిచ్చారు. సిద్దిపేట ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. వచ్చే నెల 6వ తేది వరకు నమోదుకు గడువు ఉందని ఎవరు కూడా నిర్లక్ష్యం చేయవద్దని సూచించారు.

ప్రతీ మహిళా వ్యాపారలో రాణించాలి

- సెర్ప్ పీఎం ఉమాపతి

నంగునూరు, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): ప్రతీ మహిళా వ్యాపార రంగాల్లో రాణించాలని సెర్ప్ పీఎం ఉమాపతి అన్నారు. సెర్ప్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎంటర్‌ప్రైజెస్ గ్రౌండింగ్ వెరిఫికేషన్‌లో భాగంగా మంగళవారం మండలంలోని రాంపూర్, సిద్దన్నపేటలో సెర్ప్ అధికారులు డీపీఎం కర్నాకర్‌తో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా ఉమాపతి మాట్లాడుతూ.. సెల్ఫ్ హెల్ప్ గ్రూప్ మహిళలను ఆర్థికంగా బలోపేతం చేయడమే లక్ష్యమన్నారు. మహిళలు వ్యాపార రంగాల్లో రాణించి ఆర్థికంగా అభివృద్ధి చెందాలని సూచించారు. మహిళలు వ్యాపారాలు నెలకొల్పుకోవడానికి బ్యాంకు, గ్రామ సంఘం, స్త్రీ నిధి, ద్వారా రుణాలు ఇస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఏపీఎం మహిపాల్, సీసీ మల్లేశం, వివోఏలు, మహిళలు పాల్గొన్నారు

ఏఐటీయూసీ ఆవిర్భావ దినోత్సవాలను జయప్రదం చేయండి: లక్ష్మణ్



సమావేశంలో మాట్లాడుతున్న ఏఐటీయూసీ నాయకులు

సిద్దిపేట అర్బన్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): ఏఐటీయూసీ 105వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను జయప్రదం చేయాలని సంఘం జిల్లా కార్యదర్శి లక్ష్మణ్ పిలుపునిచ్చారు. సిద్దిపేటలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. సంఘం ఆవిర్భావించిన నాటి నుంచి కార్మికుల సమస్యలపై నిరంతర పోరాటాలు నిర్వహిస్తున్నామని అన్నారు. ఆవిర్భావ సభకు అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని అన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు పిట్ల మల్లేశం, కర్నాల చంద్రం, సహాయ కార్యదర్శి తయునుపల్లి భిక్షపతి, జిల్లా నాయకులు పాల్గొన్నారు.

గంజాయి విక్రయిస్తున్న ఇద్దరి అరెస్ట్

గజ్వేల్ రూరల్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): గంజాయి విక్రయిస్తున్న ఇద్దరు నిందితులను సిద్దిపేట టాస్క్‌ఫోర్స్ పోలీసులు, గజ్వేల్ పోలీసులు పట్టుకున్నారు. గజ్వేల్ ఇన్‌స్పెక్టర్ సైదా, అదనపు ఇన్‌స్పెక్టర్ ముత్యంరాజు తెలిపిన వివరాల ప్రకారం.. మంగళవారం మధ్యాహ్నం ప్రజ్ఞాపూర్‌లోని ఓ వైన్స్‌షాప్ దగ్గర మిర్చి బండి నిర్వహిస్తున్న ప్రజ్ఞాపూర్‌కి చెందిన మహ్మద్ అష్రఫ్, ఆకాశపు సాయికుమార్ గంజాయిని అమ్ముతున్నట్లు విశ్వసనీయ సమాచారం అందుకున్న సిద్దిపేట టాస్క్‌ఫోర్స్ పోలీసులు, ఇన్‌స్పెక్టర్ సైదా, అదనపు ఇన్‌స్పెక్టర్ ముత్యంరాజు సిబ్బందితో కలిసి వెళ్లి నిందితులను పట్టుకున్నారు. వారిని విచారించగా బీహార్‌కు చెందిన రాహుల్ అనే వ్యక్తి తమకు గంజాయిని విక్రయిస్తున్నాడని, తాము వినియోగించడంతో పాటు ఇతరులకు విక్రయిస్తున్నట్లు వెల్లడించారు. వారి నుంచి 335 గ్రాముల గంజాయి, ద్విచక్రవాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరిని అరెస్ట్ చేసి జ్యుడిషియల్ రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు వెల్లడించారు.

గజ్వేల్ ఆర్డీవోగా చంద్రకళ బాధ్యతల స్వీకరణ

గజ్వేల్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): గజ్వేల్ ఆర్డీవోగా వీవీఆర్ చంద్రకళ బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు గజ్వేల్ ఆర్డీవోగా పనిచేసిన బన్సీలాల్ కొల్లాపూర్ ఆర్డీవోగా బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేయగా, సోమవారం రాత్రి రిలీవ్ అయ్యారు. విద్యాశాఖ పబ్లికేషన్స్‌లో రిజిస్ట్రార్‌గా పనిచేస్తున్న చంద్రకళ గజ్వేల్ ఆర్డీగా బదిలీపై వచ్చారు. ఈ మేరకు మంగళవారం ఆమె గజ్వేల్ ఆర్డీవో కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. అనంతరం సిద్దిపేట జిల్లా కలెక్టర్ మనూచౌదరిని మర్యాదపూర్వకంగా కలిసి, పూలమొక్కను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రజలకు అందుబాటులో ఉంటూ నాణ్యమైన సేవలు అందించేందుకు కృషిచేస్తానని తెలిపారు.

'ప్రమాదాలను అరికట్టేందుకే బారికేట్ల ఏర్పాటు'

ములుగు, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదాలను అరికట్టేందుకే బారికేట్లు ఏర్పాటు చేసినట్లు గజ్వేల్ రూరల్ సీఐ మహేందర్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని వంటిమామిడిలో మంగళవారం ఫెడిలిట్ కంపెనీ వారు 5 బారికేట్స్ పోలీసులకు అందజేశారు. ఈ సందర్భంగా సీఐ మహేందర్‌రెడ్డి మాట్లాడారు. బారికేట్లను సిబ్బంది మూలమలుపుల వద్ద ఏర్పాటు చేశారు. ఆయనవెంట ములుగు ఎస్ఐ విజయ్‌కుమార్, కరుణాకర్‌రెడ్డితో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

యువతే దేశానికి వెన్నుముక

- మర్కుక్ ఎస్ఐ దామోదర్

మర్కుక్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): యువతే దేశానికి వెన్నుముకని, యువత సన్మార్గంలో నడిస్తేనే సమాజం బాగుపడుతుందని మర్కుక్ ఎస్ఐ దామోదర్ అన్నారు. పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవాల్లో భాగంగా మండలంలోని ఎర్రవల్లిలో ఏర్పాటు చేసిన వాలీబాల్, క్రికెట్ టోర్నమెంట్ ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో ప్యాక్స్ వైస్ చైర్మన్ బాలరాజు, రోటరీక్లబ్ ఆఫ్ గజ్వేల్ అధ్యక్షుడు తుమ్మ కృష్ణ, గజ్వేల్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పాండరి, ఏఎస్ఐ రవీందర్, మండల స్పోర్ట్స్ క్లబ్ అధ్యక్షుడు కృష్ణ, క్రీడాకారులు తదితరుల పాల్గొన్నారు.

ప్రజాసంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం: కొమ్మూరి

చేర్యాల, అక్టోబరు 29: ప్రజాసంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తున్నదని జనగామ డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి అన్నారు. చేర్యాల మండలం నాగపురి శివారు గండికుంట కాలనీలో చేపట్టనున్న సీసీ రోడ్డు పనులను మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత బీఆర్‌ఎస్ హయాంలో నేతలు సంపదను కొల్లగొట్టడంతో పాటు ఖజానాను లూటీచేసి రాష్ట్రాన్ని అప్పులపాలు చేశారని ఆరోపించారు. సీఎం రేవంత్‌రెడ్డి పరిపాలన కార్యదక్షతతో రాష్ట్ర ఆర్థిక పరిస్థితులను చక్కబెడుతూనే అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలుచేస్తూ ప్రజల కష్ట సుఖాల్లో పాలుపంచుకుంటున్నారన్నారు. అనంతరం కడవేరుగు శివారులో కొనసాగుతున్న హై లెవల్ బ్రిడ్జి నిర్మాణం పనులను పరిశీలించారు. కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షుడు కొమ్ము రవి, పట్టణాధ్యక్షుడు మంచాల చిరంజీవులు, నాయకులు ఆది శ్రీనివాస్, కొండపాక భిక్షపతి, ఆరుట్ల వినీత్, వజ్రోజు శంకరాచారి, ముస్యాల యాదగిరి తదితరులు పాల్గొన్నారు.



చేర్యాల పట్టణంలోని పాతబస్టాండు వద్ద కార్యకర్తలతో కలిసి టీ తాగుతూ ముచ్చటిస్తున్న కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి

ధాన్యం దళారులపాలు!

(ఐదోపేజీ తరువాయి)



ట్రాక్టర్‌లో ధాన్యం తీసుకొస్తున్న రైతులు

సాయ మార్కెట్లలోని గోదాములకు, ఎఫ్‌సీఐ గోదాములకు ధాన్యాన్ని తరలించి తాత్కాలికంగా నిల్వ చేస్తున్నారు. మిల్లర్లతో చర్చలు సఫలం కాగానే ఈ ధాన్యాన్ని మళ్లీ మిల్లుల్లోకి పంపించాల్సి ఉంటుంది. రవాణా, హమాలీ ఖర్చులు కూడా రెండింతలు పెరగనున్నాయి. కాగా ఈ అంశంపై త్వరలోనే తుది నిర్ణయం ప్రకటించనున్నారు. అప్పటివరకైనా రైతులకు భరోసా కల్పించే విధంగా అధికార యంత్రాంగం చర్యలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

వారం రోజులవుతున్నది



బెజ్జంకి మండలం గాగిల్లాపూర్‌లో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రానికి ధాన్యం తీసుకొచ్చి వారం అవుతుంది. ఇంకా వడ్లు కొంటలేరు. మబ్బులు వచ్చేసరికి వర్షం పడుతుందేమోనని భయంగా ఉంది. ప్రతీరోజు ధాన్యాన్ని ఆరబెట్టి కుప్పలు పోయాల్సి వస్తోంది. పంట చేతికి రావడానికి పెట్టుబడి పెట్టాం, కష్టపడ్డాం. ఆ కష్టానికి ఫలితం దక్కాలంటే వెంటనే వడ్లు కొనుగోలు చేయాలి

\- తిరుపతి, రైతు, గాగిల్లాపూర్

క్వింటాల్‌కు రూ.400 నష్టం



ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించకపోవడంతో పొలం నుంచే నేరుగా రైస్ మిల్లుకు ధాన్యం అమ్ముతున్నాం. క్వింటాలుకు రూ.1900 ఇస్తున్నారు. కొనుగోలు కేంద్రంలో వడ్లకు అనేక ఆంక్షలు విధించడమే కాకుండా కేంద్రాలను ప్రారంభించడంలో జాప్యం చేస్తున్నారు. ప్రభుత్వం రూ.2300 ఇస్తామని చెప్పినా కేంద్రాలు ప్రారంభించలేదు. అందుకే రూ.400 నష్టానికే అమ్ముకుంటున్నా.

\-వేణుగోపాల్‌రెడ్డి, రైతు, రాఘవాపూర్